క్లుప్తంగా

బాస్కెట్‌బాల్ పోటీల్లో బుల్లయ్య కళాశాల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న బుల్లయ్య కాలేజీ సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: ఇటీవల ముగిసిన ఆంధ్రా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల బాస్కెట్‌బాల్ 2023–24 పోటీల్లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల టీమ్ తృతీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా సోమవారం కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ విజేతలను అభినందించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి కోసం క్యూ



సీతమ్మధార రైతుబజారులో ఉల్లి కౌంటర్ వద్ద వినియోగదారులు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులో ఉల్లిపాయల కోసం వినియోగదారులు క్యూకట్టారు. ఉల్లి సరఫరా లేకపోవడంతో కిలో రూ.36 నుంచి రూ.58కు ధర పెరిగింది. హోల్‌సేల్‌లో కిలో ఉల్లిపాయలు రూ.80కు విక్రయిస్తున్నారు. రైతుబజారులో రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి సోమవారం ఉల్లి విక్రయాలు జరిపారు. ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్ పర్యవేక్షించారు.

పూరిల్లు దగ్ధం



బిలాల్ కాలనీలోని పూరింట్లో దగ్ధమైన సామగ్రి

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార బిలాల్ కాలనీలో సంభవించిన అగ్ని ప్రమాదంలో ఓ పూరిల్లు దగ్ధమైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కొండవాలు ప్రాంతం బిలాల్ కాలనీలో పరదేశి అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి పూరింట్లో నివసిస్తున్నాడు. సోమవారం ఉదయం ఎప్పటిలాగే దేవుడికి దీపం వెలిగించి అడ్డుగా క్లాత్ కర్టన్ వేసి పనికి వెళ్లిపోయారు. ఉదయం 8.30 గంటల సమయంలో దానికి నిప్పంటుకుని పూరిల్లు దగ్ధమై సామగ్రి కాలిపోయాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఎటువంటి ప్రాణహాని జరగలేదు. స్థానికులు గమనించి అగ్నిమాపక శాఖ అధికారులకు, పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ద్వారకా స్టేషన్ ఎస్‌ఐ ధర్మేంద్ర సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

చెదల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

సీతమ్మధార: మనస్తాపంతో ఓ వ్యక్తి చెదల నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలెం మాదేటి గార్డెన్స్‌లో గుప్తా(48), పవనొట్టి సావిత్రి దంపతులు నివసిస్తున్నారు. రెండేళ్లుగా నోటి క్యాన్సర్‌తో అతడు బాధపడుతున్నాడు. ఎంవీపీలోని మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్‌లో ఆపరేషన్ చేయించుకున్నాడు. కొద్ది రోజులుగా మానసికంగా బాధపడుతున్న గుప్తా సోమవారం ఇంట్లో ఉన్న చెదల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న భర్త నోటి నుంచి రక్తం రావడాన్ని భార్య గమనించి వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గుప్తా మృతిచెందాడు. మృతుడి భార్య సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ విజయకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రా'ఫికర్'

- రామాటాకీస్ రోడ్‌లో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల తిష్ట
- ట్రాఫిక్ సమస్యలతో జనం సతమతం



రామాటాకీస్ రోడ్‌లోని కంటి ఆస్పత్రి వద్ద నిలిపిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, ట్రాఫిక్‌లో వాహనాలు



అంబేద్కర్ భవన్ వద్ద ప్రైవేట్ బస్సులోకి కార్గో పార్సిళ్లు లోడ్ చేస్తున్న రిక్షావాలాలు

సీతంపేట: నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల కారణంగా విపరీతంగా ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రైవేటు బస్సులు ఒకదాని వెంట మరొకటి నిలపడంతో ఆ మార్గంలో ప్రయాణించే వారు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. వీటిని నియంత్రించాల్సిన వ్యవస్థలు చోద్యం చూస్తున్నాయి. దీంతో ప్రజలకు నిత్యం ట్రాఫిక్ వెతలు తప్పడం లేదు.

ఒకదాని వెంట మరొకటి..

ముఖ్యంగా రామాటాకీస్ రోడ్‌లో ట్రావెల్స్ బస్సులు తిష్ట వేశాయి. ఈ కూడలి నుంచి సత్యం జంక్షన్ ఇటీవల కాలంలో వాహనాల రద్దీ పెరిగింది. గురుద్వారా నుంచి సీతంపేట మీదుగా ద్వారకా బస్ స్టేషన్, అక్కడి నుంచి రామాటాకీస్ మీదుగా మద్దిలపాలెం వెళ్లే రహదారుల్లో రాకపోకలు పెరిగాయి. దీంతో రామాటాకీస్ ముందు నుంచి సత్యం కూడలికి, బుల్లయ్య కళాశాల పక్కనుంచి ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇదే రహదారిలో ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి వద్ద, అంబేడ్కర్ భవన్ వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ కార్యాలయాలు ఉండటంతో రామాటాకీస్ కూడలి నుంచి బుల్లయ్య కాలేజీ వరకు ఇరువైపులా రహదారుల్లో ట్రావెల్ బస్సులను పదుల సంఖ్యలో ఒకదాని వెంట ఒకటి నిలిపి ఉంచుతున్నారు. ట్రావెల్ సంస్థలు ప్రయాణికుల పికప్, డ్రాపింగ్ పాయింట్లను రామటాకీస్ రోడ్‌లో ఏర్పాటు చేయడంతో నిత్యం ప్రైవేటు బస్సులతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులను దింపడానికి ఉదయం 5 నుంచి 10 గంటల వరకు బస్సులను నిలుపుతున్నారు. మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 11 గంటల వరకు ఇక్కడ నుంచి హైదరాబాద్, తిరుపతి, చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులను ఎక్కించుకోవడానికి బస్సులు నిలిపి ఉంచుతున్నారు. ప్రతి రోజూ ఇదే తంతు కొనసాగుతోంది. సాయంత్రం వేళల్లో వివిధ కార్యాలయాల నుంచి వచ్చే వారు, స్కూళ్లు, కళాశాలల నుంచి ఇంటికి చేరే వారు.. ఇలా అందరి వాహనాలతో రామాటాకీస్ రోడ్ రద్దీగా తయారైంది. చీకటి పడితే ఈ మార్గంలో ప్రయాణించడం ఒక ప్రహసనంగా మారింది.

వీకెండ్‌లో మరింత రద్దీ..

వీకెండ్ శని, ఆదివారాల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. రెండు రోజులు సెలవు కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు వారి ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల కోసం క్యూలు కడుతున్నారు. దీంతో ఆయా బస్సుల పికప్, డ్రాపింగ్ పాయింట్ల వద్ద తీవ్ర రద్దీ వాతావారణం నెలకొంటోంది. బస్సులు ఎక్కడానికి డ్రాప్‌చేసే వాహనాలు, దిగిన వారికి పికప్ చేసుకోవడానికి వచ్చిన వారి వాహనాలు, కార్గో పార్సిల్స్ రవాణాతో ట్రాఫిక్ సమస్యలు మరింత పెరుగుతున్నాయి. సంబంధిత అధికారులు దృష్టి సారించి ప్రైవేట్ ట్రావెల్ బస్సుల పికప్, డ్రాపింగ్ పాయింట్లను ప్రధాన రహదారుల్లో కాకుండా ప్రజలకు ఇబ్బంది లేని చోట ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు.

ప్రజల వద్దకే ప్రజాప్రతినిధులు

సీతంపేట: ప్రజల వద్దకే ప్రజాప్రతినిధులు వెళ్లి వారి సమస్యలు తెలుసుకునేలా ఏ ప్రభుత్వంలో ఇటువంటి కార్యక్రమం చేపట్టలేదని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 26వ వార్డు శాంతిపురం సచివాలయం(127) పరిధిలోని శంకువానిపాలెంలో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మితో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని, అభివృద్ధి పనులను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కుల, మత, పార్టీలతో సంబంధం లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, డైరెక్టర్ పాండవ శ్రీను, రామలింగేశ్వరాలయం చైర్మన్ బొడ్డేటి కిరణ్, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, 26వ వార్డు నాయకులు రేవతీరావు, నవాబ్, శేషు, అమ్మాజి, ఎం.సునీల్, శ్యామల, హరికృష్ణ, విజయ్ పాల్, ఫరూఖ్, బాబ్‌జాన్, సుశీల, రమాదేవి, గౌస్య, లక్ష్మి, లలిత తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు కరపత్రం అందజేస్తున్న కె.కె.రాజు, పీలా వెంకటలక్ష్మి

'స్పందన'కు 20 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 20 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆనంద్‌కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై పూర్తి నిఘా

- సీపీ రవిశంకర్



ఏసీపీ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న పోలీస్ కమిషనర్ రవిశంకర్

గోపాలపట్నం: రౌడీషీటర్ల కదలికలపై పూర్తి నిఘా ఉంచాలని నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశించారు. వెస్ట్ ఏసీపీ కార్యాలయంతో పాటు ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్, కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికరంగా తనిఖీ చేశారు. వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కార్యాలయంలో నమోదవుతున్న పలు కేసులు గురించి ఆరా తీశారు. మహిళలపై ఎటువంటి దాడులు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. దిశ యాప్‌పై మరింత అవగాహన కల్పించాలని సూచించారు. సబ్ డివిజన్ పరిధిలో ఎన్‌డీపీఎస్ కింద నమోదైన కేసులతో పాటు పలు మార్లు అరెస్ట్ అయిన ఫెడర్లపై పీడీ యాక్టు నమోదు చేసే చర్యలపై చర్చించారు. డివిజన్ పరిధిలోని స్టేషన్ల పని తీరుపై ఏసీపీ అన్నెపునరసింహ మూర్తిని అడిగి తెలుసుకున్నారు. కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. సిబ్బంది పని తీరును పరిశీలించారు. ట్రాఫిక్ రద్దీ ప్రాంతాల్లో ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో సిబ్బందిని పని తీరును పరిశీలించారు. పెండింగ్ కేసుల గురించి విచారించారు. వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఆయనతో పాటు డీసీపీ–2 ఆనందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'.. పేదలకు భరోసా

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల ఆరోగ్యానికి భరోసా ఇస్తోందని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. 47వ వార్డు కంచరపాలెం పరిధి కప్పరాడ, సంజీవయ్య కాలనీ సచివాలయాలకు సంబంధించి కప్పరాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. జీవీఎంసీ అధికారుల నేతృత్వంలో వైద్య నిపుణులు సుమారు 185 మంది రోగులకు పలు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సనపల రాజేంద్ర తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్ కామేశ్వరి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తి, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో వృద్ధుడి ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న కె.కె.రాజు

ఆటోలో మేయర్.. సైకిల్‌పై కమిషనర్



ఆటోలో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్న మేయర్ హరివెంకటకుమారి

- సొంత వాహనాలు వదిలి కార్యాలయానికి పయనం
- కాలుష్య నియంత్రణకు సహకరించాలని విన్నపం



బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు. మేయర్ హరివెంకట కుమారి సోమవారం తమ సొంత వాహనం వదలి క్యాంపు కార్యాలయం నుంచి ఆటోలో ప్రయాణించి జీవీఎంసీకి చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వచ్చారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో ఇద్దరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో వాయి, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నగరంలోని ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను వారి సిబ్బందితో ఉపయోగించేలా చూడాలన్నారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలని సూచించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 22 మందికి జరిమానా

- ఒకరికి 5 రోజుల జైలు

గోపాలపట్నం: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 2వ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అండ్ సెకండ్ క్లాస్ ఎక్సైజ్ కోర్టు 22 మందికి జరిమానాలు, ఒక వ్యక్తికి 5 రోజుల జైలు శిక్ష విధించింది. గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. బాజీ జంక్షన్ నుంచి గోపాలపట్నం ప్రాంతాల్లో గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 23 మందిపై కేసులు ఇటీవల నమోదు చేశారు. వారిని సెక్షన్ 180, 181, 185, ఎంవీ ఎక్ట్ ప్రకారం రూ.2,000 నుంచి రూ.8,000 వరకు జరిమానాలు విధించారు. కొత్తపాలేనికి చెందిన గంట్యాడ నాగభూషణానికి 5 రోజుల జైలు శిక్ష, రూ.50 జరిమానా వేశారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు. యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

దాబాగార్డెన్స్: దేశంలో మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రైవేటీకరణ విధానాలు విడనాడాలని సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు పిలుపునిచ్చారు. నవంబర్ 27, 28 తేదీల్లో విజయవాడలో 48 గంటల పాటు నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన సిటూ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, విద్యార్థులు, యువజనులు, మహిళలు, దళితులు తదితర అన్ని తరగతుల ప్రజానీకంపై తన దాడిని ఎక్కుపెట్టిందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుకొమ్మలుగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను ఆదానీ, అంబానీలకు కట్టబెడుతోందన్నారు. స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కార్మికులకు నష్టం చేసే 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, ప్రజలకు నష్టం చేసే విద్యుత్ సవరణ చట్టం 2020 రద్దు చేయాలన్న డిమాండ్లతో దేశంలోని అఖిలపక్ష కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా నవంబర్ 27, 28 తేదీల్లో అన్ని రాష్ట్రాల్లో మహాధర్నాలు జరపాలని పిలుపునిచ్చాయన్నారు. సిటూ నాయకులు కేఎం శ్రీనివాసరావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఎస్.జ్యోతీశ్వరరావు, బి.జగన్, సీతాలక్ష్మి, మంగశ్రీ, అప్పలరాజు, జి.శ్రీనివాస్, పలు యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

ధర్మారావుకు సాహితీ విఖ్యాత పురస్కారం



పురస్కారం అందుకుంటున్న జీవీఎంసీ స్కూల్ ఉపాధ్యాయుడు ధర్మారావు

సీతంపేట: అర్యాణి సకల కళావేదిక ఆధ్వర్యంలో శ్రీగౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ ఇటీవల ఇంటర్‌నెట్ వేదికగా నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి రికార్డ్ కవితల పోటీలో అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో పనిచేస్తున్న గ్రేడ్ 1 తెలుగు ఉపాధ్యాయుడు ఎం.వి.ధర్మారావుకు సాహితీ విఖ్యాత అంతర్జాతీయ పురస్కారం వరించింది. కరీంనగర్ పట్టణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు దూడపాక శ్రీధర్ చేతుల మీదుగా పురస్కారం, సన్మానం అందుకున్నారు. ఒక్క గంట వ్యవధిలో నాలుగు కవితలు రాసినందుకు తన సాహితీ ప్రతిభను గుర్తించి పురస్కారం ప్రదానం చేశారని ఆయన తెలిపారు. కవి, విశ్లేషకులు భవానీ సాహితీ కళావేదిక అధ్యక్షులు వైరాగ్యం ప్రభాకర్ చేతుల మీదుగా స్వర్ణ కంకణం గౌరవాన్ని పొందారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన సలహాదారులు పొర్ల వేణుగోపాల్, కణిక సాహితీ ప్రక్రియ రూపకర్త రమాదేవి కొలకలూరి పాల్గొన్నారు. ఈ అవార్డు రావడంపై ధర్మారావును స్కూల్ హెచ్ఎం బి.లక్ష్మీనరస, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రీ హాలోవీన్ సందడి



ఆత్మల వేషధారణల్లో అలరిస్తున్న ఐఎన్ఎస్‌డీ విద్యార్థులు

సీతంపేట: సీతంపేట మెయిన్ రోడ్‌లోని బీవీకే కళాశాల పక్కన గల ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ డిజైన్(ఐఎన్ఎస్‌డీ)లో సోమవారం ప్రీ హాలోవీన్ డే వేడుకలు సందడిగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ఒళ్లు గగుర్పొడిచేలా విచిత్ర వేషధారణలు, ఆత్మలను పోలిన విధంగా ముఖానికి రంగులు, మేకప్ వేసుకుని అలరించారు. ఐఎన్ఎస్‌డీలో చదువుతున్న విద్యార్థులు ఆధునిక టెక్నాలజీతో, అద్భుతమైన డిజైన్లతో, చక్కని అభినయనంతో ఆకట్టుకున్నారని డైరెక్టర్ హేమసుందర్ టెంకకొనియాడారు. ఇంగ్లిష్ దేశాల్లో హాలోవీన్(ఆత్మల ఘోష వేడుకలు) పాటించే సంప్రదాయం ఉందని, దానిపై అవగాహన కల్పిస్తూ మంచి కార్యక్రమం చేపట్టామన్నారు. అమెరికా వంటి దేశాల్లో ఈ వేడుకలను అత్యంత అద్భుతంగా నిర్వహిస్తారని చెప్పారు. తమ సంస్థ విద్యార్థులు కూడా అదే స్థాయిలో వేడుకలు నిర్వహించడం విశేషమన్నారు. కార్యక్రమంలో సంస్థ ఫ్యాషన్ డిజైన్ విభాధిపతి అమృత, ఇంటీరియర్ డిజైనింగ్ విభాగాధిపతి సునయన, హెచ్ఆర్ డైజీ ఫ్లోరెన్స్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం



మాట్లాడుతున్న వామనమూర్తి

సీతంపేట: అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్ శ్రీనివాస నగర్ ఆటో స్టాండ్ వద్ద సోమవారం ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి ఎర్రజెండాను ఆవిష్కరించి అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. కార్మిక వర్గానికి హక్కులు కల్పించాలని బ్రిటిష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జాతీయ గౌరవ అధ్యక్షులు జవహర్‌లాల్ నెహ్రూ, బాలగంగాధర తిలక్ నాయకత్వంలో 1926లో ట్రేడ్ యూనియన్ చట్టాన్ని సాధించారని గుర్తుచేశారు. నాటి నుంచి నేటి వరకు కార్మికులకు చట్టాలు, పని గంటలు కావాలని దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం సాధించాలని మహత్తరమైన పోరాటాలు నడిపిన చరిత్ర ఏఐటీయూసీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద, నాయకులు రావికృష్ణ, కాండ్రేగుల రాము, వై.వెంకట్, కేలం శివ, శేఖర్, గణేష్‌కుమార్, శంకర్, కోటి, ఈశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

46వ వార్డులో మహా అన్నదానం



సంజీవయ్య కాలనీలో అన్నప్రసాదం వడ్డిస్తున్న కె.కె.రాజు, కటుమూరి సతీష్



అన్నదానం ప్రారంభిస్తున్న విష్ణుకుమార్‌రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు తాటిచెట్లపాలెం సంజీవయ్య కాలనీలో దుర్గాదేవి మహోత్సవాల్లో భాగంగా హెల్పింగ్ హ్యాండ్స్ బాయ్స్, సంజీవయ్య యూత్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాన్ని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె రాజు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ప్రారంభించారు. ముందుగా దుర్గాదేవికి వారు ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 2 వేల మందికి అన్నదానం చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, నాయకులు చిన్నా, సునీల్, శ్రీను, రెడ్డి కృష్ణవేణి, సాయి, కృపా, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

5 వేల మందికి అన్నసమారాధన

కంచరపాలెం పరిధి గొల్లకంచరపాలెం దుర్గానగర్‌లో గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ, దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథులు రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి శాఖ డైరెక్టర్, జిల్లా ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సభ్యురాలు కాయిత వెంకటలక్ష్మి రత్నాకర్, 56వ వార్డు కార్పొరేటర్ రాజశేఖర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్య శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 5 వేల మందికి అన్నదానం చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పల్లా ఎర్నికుమార్, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, పాలకవర్గ సభ్యులు పాత్రపల్లి వెంకటరమణ, యలమంచలి వెంకటరావు, సానబోయిన సంపత్, పల్లా పెంటారావు, నక్కా శంకరరావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సామాజిక సేవ

మురళీనగర్: ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ ద్వారా సామాజిక సేవ చేయవచ్చని మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. మురళీనగర్ సమీపంలోని తెన్నేటినగర్‌లో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సేవా కార్యక్రమాల నిర్వహణకు ముందుకు రావాలన్నారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, బీజేపీ వార్డు నాయకుడు సనపల రామకృష్ణ, బీజేపీ 51వ వార్డు నాయకురాలు తమ్మినేని పద్మజ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సనపల విజయ్‌కుమార్, నంబాళ్ల ఈశ్వరరావు, మణిదీప్, ఉపేంద్ర, సంతోష్ పాల్గొన్నారు.

8న విద్యా సంస్థల బంద్

- జయప్రదం చేయాలని జేఏసీ పిలుపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

సీతమ్మధార: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటం చేపట్టి నవంబర్ 8వ తేదీతో వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద బంద్ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు పోరాటాన్ని నీరుగార్చే విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. వెయ్యి రోజులుగా కార్మికులు, ప్రజలు పోరాటాలు చేస్తున్నా పట్టించుకోకుండా స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టే కుతంత్రాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీని గద్దె దించి, స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుంటామన్నారు. విద్యార్థులు, ప్రజలు, విద్యాసంస్థల యాజమాన్యాలు బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొని, జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ యు.ఎస్.ఎన్.రాజు, నాయకులు రాంబాబు, ఎల్.జె.నాయుడు, యు.నాగరాజు, అభిలాష భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.